పొత్తుల తలనొప్పులు

- రెండో జాబితా వరకు సీనియర్ల వేచిచూపు
- తరువాత అసంతృప్తులు బహిర్గతం
- తేల్చుకోలేని అనకాపల్లి ఎంపీ టికెట్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేనల పొత్తు లాభం ఎలా ఉండబోతుందోగానీ, ప్రస్తుతం టికెట్ల కేటాయింపు టిడిపికి తలనొప్పిగా మారింది. జనసేనలో ఈ తలనొప్పి ప్రస్తుతానికి అంతగా కన్పించనప్పటికీ, టిడిపిలో మాత్రం ఎక్కువగానే ఉంది. ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలో తలెత్తిన అసంతృప్తులు, రెండో జాబితా నాటికి ముదిరి రచ్చకెక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. తొలి జాబితాలో అనకాపల్లి టిక్కెట్ రాని టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి బయటపడనప్పటికీ, టిడిపి అధినేత చంద్రబాబు నిర్ణయాలపై పార్టీ అనుచరుల దగ్గర మండిపడుతున్నట్లు సమాచారం. అనకాపల్లి ఎంపీగా తన తనయుడు విజయ్‌ను బరిలో దించాలని అయ్యన్నపాత్రుడు తీవ్ర ప్రయత్నం చేస్తూవస్తున్నారు. అనకాపల్లి ఎంపీగా తన కుమారుడు పోటీచేస్తే తనను ఆదరించినట్లే, తన కుమారుడిని ఆదరించాలని చంద్రబాబు పాల్గొన్న కోటపాడు సభలో అయ్యన్న బహిరంగంగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

అయితే... ఒక కుటుంబం నుంచి ఇద్దరికి టికెట్లు ఇవ్వకూడదన్న పార్టీ విధానం ప్రకారం అయ్యన్న, విజయ్‌కు టిక్కెట్ ఇవ్వడానికి చంద్రబాబు అయిష్టత చూపారు. దీంతో ఎంపీ టికెట్ విజయ్‌కు ఇవ్వకపోతే, నర్సీపట్నం టిక్కెట్ తనకు బదులు విజయ్‌కు ఇవ్వాలని చంద్రబాబును అయ్యన్న కోరారు. ఆ సూచనను చంద్రబాబు పరిగణనలోకి తీసుకోకుండా తొలి జాబితాలో నర్సీపట్నం టిక్కెట్ అయ్యన్నకు కేటాయించారు. ఇదే సందర్భంలో కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి లోకేష్ పోటీ చేయనుండడంతో పార్టీ సీనియర్ నాయకుల్లో అసంతృప్తికి దారితీసింది. ఒక కుటుంబం నుంచి ఇద్దరికి టికెట్ ఇవ్వకూడదన్న పార్టీ విధానం చంద్రబాబు కుటుంబానికి వర్తించదా? అన్న ప్రశ్నలు నాయకుల నుంచి విన్పిస్తున్నాయి. ఎంపీ టికెట్ తన తనయునికి ఇవ్వకపోయినా, పార్టీ జెండా మోసిన స్థానికునికి ఇవ్వాలని అయ్యన్న గతంలో అన్నారు. దీనికి భిన్నంగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తే అయ్యన్న విబేధించే అవకాశముంది.

తొలి జాబితాలో చోటు లేకపోవడంతో పెందుర్తి నుంచి పోటీచేయాలని భావిస్తున్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి అవమానాన్ని మౌనంగా భరిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పోటీచేయడానికి సిద్ధపడుతున్నారు. ఇదే జరిగితే బండారు బయటపడనున్నారు. యలమంచిలి, వి.మాడుగుల, చోడవరం, నియోజకవర్గ అభ్యర్థులపై టిడిపిలో ఇంకా స్పష్టతలేదు. ఈ నియోజకవర్గాల్లో ఆశావహుల్లో ఎవరికిచ్చినా, వీరిని కాదని కొత్తవారికి ఇచ్చినా గ్రూపులు బయటపడనున్నాయి. రెండో జాబితాలో అసంతృప్తులు బహిర్గతమవుతాయన్న భయం చంద్రబాబులో ఉండడంతో వాటిని చల్లార్చి, ప్రకటించేందుకు కొంత వ్యవధి తీసుకుంటున్నట్లు కనబడుతోంది.

డిఫెన్స్, షిప్‌యార్డుల ప్రయివేటీకరణ విరమించాలి

సిఐటియు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : డిఫెన్స్, షిప్‌యార్డుల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటునట్టు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విశాఖ పర్యటనలో ప్రకటించాలని షిప్‌యార్డు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎస్ఎన్.రాజు, ఎస్.ప్రసాద్ డిమాండ్‌చేశారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ, డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ అరమనే ఈ ఏడాది జనవరి 4న సిఎన్‌బిసి టీవీ18 కి ఇచ్చిన ఇంటర్వ్యూలో డిఫెన్స్, షిప్‌యార్డుల్లో పెట్టుబడులు ఉపసంహరణ చేయడానికి ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారని, ఇది భవిష్యత్తులో ప్రవేటికరణకు మార్గమని, ఈ నిర్ణయాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు ఆ దేశ రక్షణ అవసరాలకు అవసరమయ్యే షిప్పులను ప్రభుత్వ రంగంలో నిర్మించి దేశభద్రతను పటిష్టం చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రపంచంలో షిప్ బిల్డింగ్ నిర్మాణంలో టాప్ వన్‌లో ఉన్న దక్షిణ కొరియాను దాటి చైనా నంబర్ వన్ స్థానానికి ఎదిగిందంటే అక్కడ షిప్‌యార్డులు ప్రభుత్వ రంగంలో ఉండడమే కారణమన్నారు. మన కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డులను మరిన్ని నిర్మించకుండా, ఉన్న వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తోందని తెలిపారు. హిందూస్తాన్ షిప్‌యార్డుకు 5 ఎఫ్ఎస్ఎస్ ఇచ్చిన ఆనందం వ్యక్త పరిచేలోపే వాటిలో కొన్ని షిప్‌లు ప్రయివేటుకు ఇస్తారని వస్తున్న వార్తలతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. 5 ఎఫ్ఎస్ఎస్‌లు షిప్‌యార్డులోనే నిర్మాణంచేపట్టేలా, 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను పర్మినెంట్ చేసేలా రక్షణ మంత్రి యాజమాన్యానికి సూచనలు చేయాలని కోరారు. 5 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు తక్షణమే ఏర్పాటు చేయాలని, సంవత్సరాలు తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మిక, స్టాఫ్ సమస్యలను పరిష్కరించేలా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రాజు, ప్రసాద్

నేటి నుంచి 9 కేంద్రాల్లో టెట్

జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు రెండు సెషన్లలో జిల్లా వ్యాప్తంగా తొమ్మిది కేంద్రాల్లో టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతుందని వివరించారు. మొత్తం 37,556 మంది పరీక్షకు హాజరవుతున్నారని వెల్లడించారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

12 స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేర్ డివిజన్‌లోని 12 స్టేషన్ల పునరాభివృద్ధికి, వాల్తేరు డివిజన్ మీదుగా నాలుగు రోడ్ల ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సోమవారం వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. వాల్తేరు డివిజన్ పరిధిలో 12 స్టేషన్లు, రెండు రోడ్డు ఓవర్ బ్రిడ్జిల వద్ద డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్‌లోని సింహాచలం, అరకు, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపడ స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్‌ల కింద తిరిగి అభివృద్ధి చేయనున్నారు. ఒడిశా ప్రాంతంలోని పర్లాకిమిడి, జైపూర్, రాయగడ, కోరాపుట్ స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తారు. చాలా కాలంగా డిమాండ్ ఉన్న విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నాలుగు రోడ్ల ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తారు. 12 స్టేషన్ల పునరాభివృద్ధికి రూ.443.47 కోట్లు, నాలుగు రోడ్ల ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.218.13 కోట్లు వెచ్చించనున్నారు.

వాల్తేరు డివిజన్‌లోని శంకుస్థాపనలపై మాట్లాడుతున్న డిఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

'దక్షిణం'పై జనసేన దృష్టి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని జనసేన పార్టీ తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ఈ నియోజకవర్గంలో జనసేన కాస్త బలపడింది. దీంతో ఆ పార్టీ తరపున అభ్యర్థిని రంగంలో దింపాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అయితే ఈ నియోజకవర్గంలో టిడిపి సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి గత మూడేళ్లుగా పనిచేస్తున్నారు. పెందుర్తి నియోజకవర్గం, సబ్బవరం మండలానికి చెందిన ఆయన అదే నియోజకవర్గంలో నుంచి టిడిపి తరపున పోటీ చేసేందుకు ప్రయత్నించారు. పెందుర్తి నియోజకవర్గంలో టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఉండటంతో, ఆయనను కాదని టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని చంద్రబాబు చెప్పారు. అదే సమయంలో పార్టీ తరపున బాబ్జికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చేందుకు ప్రతిపాదించారు. తనకు ఎమ్మెల్సీ పదవి వద్దని, ఎమ్మెల్యేగా పనిచేస్తానని, అవకాశం ఇమ్మని బాబ్జి కోరారు. అనంతరం జరిగిన పరిణామాలలో విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపి తరపున గెలుపొందిన వాసుపల్లి గణేష్ కుమార్ ఆ పార్టీని వీడి వైసిపి పంచన చేరారు. దీంతో దక్షిణ నియోజకవర్గం పార్టీ బాధ్యతలు చూడాలని, 2024 ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలో పార్టీ టికెట్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో బాబ్జి అంగీకరించి పనిచేస్తున్నారు. టికెట్ వస్తుందని ఆశలో ఉన్నారు. అయితే అనుకోని విధంగా జనసేన పార్టీ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ప్రతిపాదన చేసింది. ఈ ప్రతిపాదనకు చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నట్లు జనసేన నాయకులు అంటున్నారు. అదే జరిగితే గండి బాబ్జికి మరోసారి నిరాశ తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో గండి బాబ్జి వచ్చి తనను కలవాలని చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. ఆదివారం బాబ్జి విజయవాడ వెళ్లి చంద్రబాబును కలిసి చర్చించారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే దక్షిణ నుంచి జనసేన పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది.

భూ టైటిల్ చట్టం రైతుల పాలిట గుదిబండ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రైతుల పాలిట గుదిబండగా మారిపోతుందని, అవినీతి అధికార యంత్రాంగంతో రైతులు ఇబ్బంది పాలవుతున్నారని మాజీ ఐఏఎస్ అధికారి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పేర్కొన్నారు. అనకాపల్లిలో వివి.రమణ రైతు భారతి హాల్లో కళాజాతను సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఓటర్లలో చైతన్యం రావాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ నాయకులు విల్లూరి పైడారావు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రొఫెసర్ పి.హరి ప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్షులు పిజే నాయుడు ప్రసంగించారు.

విద్యార్థులకు వరం విద్యా రుణం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉన్నత విద్యల కొరకు బ్యాంకులు ఇచ్చే విద్యారుణం విద్యార్థులకు ఒక వరమని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి చెప్పారు. సోమవారం ఆయన కలెక్టరు కార్యాలయంలో భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత, అవసరం వున్న విద్యార్థులు తమకు కేవలం బ్యాంకు ఖాతా ఉన్నట్లయితే విద్యారుణం పొందవచ్చని, రూ.4 లక్షల వరకు తీసుకునే రుణానికి ఎటువంటి తాకట్టు ఉండదని చెప్పారు. కోర్సు పూర్తయిన ఒక సంవత్సరం తరువాత తిరిగి చెల్లింపులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను పూర్తిగా విస్మరించి వారికి అన్యాయం చేస్తుందని ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని ఈ నాలుగున్నరేళ్ల కాలంలో పూర్తిగా నిర్వీర్యం చేసిందని,భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుందని పేర్కొన్నారు. దీంతో భవన నిర్మాణంలో పని చేస్తున్న తాపీ మేస్త్రీలు, రాడ్ బెండర్లు, సెంట్రింగ్ సిబ్బంది, కార్పెంటర్లు, పురుష, మహిళా కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్గత విభేదాలు సద్దుమణిగాయి

ప్రజాశక్తి-చోడవరం : బుచ్చయ్యపేట మండలంలోని వైసిపి కార్యకర్తల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు సద్దుమణిగాయని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. రెండు మూడు పంచాయతీల్లో స్థానిక నాయకులు కార్యకర్తలు మధ్య ఉన్న విభేదాలు వివాదానికి తలెత్తయని పేర్కొన్నారు. జిల్లా పార్టీ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి చెప్పడంతో పాటు, మండల పార్టీ అధ్యక్ష పదవి నియామకం కోసం అందరి సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పార్టీలో ఉండి ప్రతిపక్ష పార్టీలకు లోపాయికారీగా పనిచేస్తున్న వారే విభేదాలు సృష్టించినట్లు తనకు తెలిసిందన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ జెడ్‌పి హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు బాలు రెడీమేడ్ వస్త్ర వ్యాపారి బాలు కుమారుడు సుప్రీం తన సొంత నిధులతో సమకూర్చిన పరీక్ష ప్లాంకులు, కౌన్సిస్ బాక్సులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.పడాల్‌దాస్, జెసిఎస్ మండల కన్వీనర్ కెవి.రమణ, ఎస్సై నాగేంద్ర, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కోరుపోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల మెటీరియల్ అందజేస్తున్న ఎస్ఐ నాగేంద్ర తదితరులు

డబ్ల్యుటిఒ ఒప్పందాలను వ్యతిరేకించాలి

-రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన

-ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి మద్దతు పలకాలని విజ్ఞప్తి

అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఒప్పందాలకు వ్యతిరేకంగా, ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి మద్దతు సంయుక్త కిసాన్ మోర్చా, ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు సోమవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం దగ్గర రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, రైతు, కూలి సంఘాల నాయకులు కోన మోహన్ రావు, గండి నాయనబాబు, శంకర్రావు, సదాశివరావు మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా డబ్ల్యూటీవోలో వెనుకబడిన దేశాలపై సంపన్న దేశాలు అమలు చేస్తున్న ఒప్పందాల వలన భారతదేశంలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సంక్షోభం నెలకొందన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వ్యవసాయ నల్ల చట్టాలను, విద్యుత్ సవరణ చట్టం, లేబర్ కోడ్‌లను తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం అబుదాబిలో జరుగుతున్న డబ్ల్యూటీవో 13వ మంత్రి వర్గ సమావేశాల్లో... భారత దేశ ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేసే, ఎంఎస్‌పిను రద్దు చేసే, మార్కెట్ యార్డులను కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పే ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాలను భారత ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పియస్.అజయ్ కుమార్, కనిశెట్టి సురేష్ బాబు, అయితిరెడ్డి అప్పలనాయుడు, గడి సూర్యారావు, పైలా రమేష్, బి.జగదీష్ పాల్గొన్నారు.

నక్కపల్లి : క్విట్ డబ్ల్యుటిఒ దినోత్సవం సందర్భంగా సోమవారం ఐబీతీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతులు నిరసన చేపట్టారు. వ్యవసాయాన్ని డబ్ల్యుటిఒ నుండి దూరంగా ఉంచాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, రైతు సంఘం నాయకులు జి.వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు, రైతులు

నిధులు దారిమళ్లింపుపై సర్పంచుల ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని సర్పంచ్‌లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సమయంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచుల న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తక్షణమే సర్పంచుల పిఎఫ్ఎంఎస్ ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా నాయకులు చింతకాయల సుజాత ముత్యాలు, వానపల్లి లక్ష్మి ముత్యాలరావు, వినోద్ రాజ్, మోటూరి సన్యాసినాయుడు, దాడి ఎరుకు నాయుడు, గొర్రిపాటి వెంకటలక్ష్మి, సన్యాసినాయుడు, జిల్లా వ్యాప్త సర్పంచులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్‌లు,

సాగులో ఉన్న పేదలకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి మండలం దోనివాని లక్ష్మి పురం గ్రామం సర్వే నెంబర్ 85లో గత 30 సంవత్సరాలుగా పేదలు జీడి మామిడి తోటలు వేసి సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం వైజాగ్ చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్‌కు సేకరిస్తున్న నేపథ్యంలో బాధిత రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, దోనివాని లక్ష్మీ పురం గ్రామం మాజీ ఎంపీటీసీ గింజాల వెంకటరమణ, సాగుదార్లు కిల్లాడి వరహాలు, గింజాల సింహాద్రి, పల్లామరినియ్య, సిరిపల్లి జగమణి, యేడిద చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నేత వైవి.సుబ్బారెడ్డి

భరత్‌ను గెలిపించే బాధ్యత అందరూ తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తా తీసుకోవాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అనకాపల్లి సిద్ధం సభ, నియోజకవర్గ వైసిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలను ఏదో విధంగా మభ్యపెట్టి ఓట్లు రాపట్టుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల ఆటలు సాగనివ్వరాదన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ అంటే జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఇష్టమని, అందుకే ఆయనకు డిప్యూటీ పదవి ఇచ్చి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను అప్పగించారని పేర్కొన్నారు. ఆయనకు సముచితస్థానమే లభిస్తుందన్నారు. మంత్రి అమర్నాథ్ రానున్న ఎన్నికలు పెత్తందారులకు, పేదవాడికి మధ్య జరిగే యుద్ధమని, ఇందులో ప్రజలు జగన్మోహన్ రెడ్డి పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ బివి.సత్యవతి, నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్, పార్టీ నాయకులు దందులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను రైతులు వినియోగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ ఉత్పత్తి ఖర్చు నానాటికి పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని ఆదాయం పెంచుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇంచార్జ్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ సిహెచ్ ముకుందరావు కోరారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో విశాఖపట్నం ఆత్మ ఆర్థిక సౌజన్యంతో చెరకులో ఒంటెకన్ను ముచ్చు సాంకేతికతపై ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిని ఏడిఆర్ ముకుందరావు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ కెవి.రమణమూర్తి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ వి.గౌరీ, డాక్టర్ సీతారామలక్ష్మి, డాక్టర్ సరిత, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ హెడ్ ఇంజరస్ ఫౌండేషన్, హీరో మోటార్ కంపెనీ వారి సహకారంతో మండలంలోని తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఒకటి నుండి ఐదో తరగతి పిల్లలకు 30 మందికి హెల్మెట్లు తిమ్మరాజుపేట గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివబాపు నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఎఫర్ట్ సదస్సుకు అపోలో వైద్యుని కథనాలు

డాక్టర్ అబ్దుల్‌ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ :జర్మనీలోని హంబర్గ్‌లో జరగనున్న యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రామాలజీ (ఎఫర్ట్) వార్షిక సదస్సుకు అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన రెండు సైంటిఫిక్ రీసెర్చ్ ఆర్టికల్స్ ఎంపికైనట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. యూరోపియన్ వార్షిక సదస్సులో ప్రెజెంటేషన్ కోసం రెండు శాస్త్రీయ కథనాలు ఆమోదించడం విశాఖ అపోలో వైద్యునికి దక్కిన అరుదైన గౌరవమని హర్షం వెలిబుచ్చారు.

విద్యుత్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : గ్రామ, వార్డు ఎనర్జీ అసిస్టెంట్, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎనర్జీ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ డిమాండ్ చేశారు. సోమవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి సదస్సులో అసోసియేషన్ల ప్రతినిధులు ఎం.బాలకాశి, సివి.మంజునాథ్ మాట్లాడుతూ సచివాలయాల్లోని 19శాఖల ఉద్యోగుల్లో కేవలం ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. రేయింబవళ్ళు ఒత్తిడితో కూడిన విధినిర్వహణతో రాష్ట్రవ్యాప్తంగా 140 మంది సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు మృతి చెందారని, మరో 300 పైబడి అంగవైకల్యం బారిన పడ్డారన్నారు. వీరికి మెడికల్ లీవులు, ఇతర ప్రయోజనాలేవీ అమలు కావడం లేదన్నారు. పాత సర్వీస్ రూల్స్‌నే అమలు చేసి, తమను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, అధ్యక్షులు మన్మధరావు, యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దొరబాబు, పడాల గోవిందు, సూర్య, ప్రవీణ్, బిల్‌రీడర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో జగనన్న కాలనీ రోడ్డు ఆక్రమణపై కాలనీవాసులు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కాలనీరోడ్డును సోమవారం జెసిబితో చదునుచేస్తుండగా కాలనీవాసులు అడ్డుకుని, ప్రశ్నించారు. అయితే ఆ స్థలాన్ని కొంతమందికి ఇళ్లస్థలాలుగా ఇవ్వనున్నారని వారు చెప్పడంతో, రోడ్డును ఆక్రమించి ఇళ్లస్థలాలు ఇవ్వడమేంటని నిలదీశారు. దీనిపై తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిటి సమస్యను విన్నవించారు. తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ధనలక్ష్మి, కృష్ణ, రామలక్ష్మి, బంటుబిల్లి శ్రీను, బంటుబిల్లి ఆదెమ్మ, రామలక్ష్మి, సుజాత కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కెవి జె.కె.లేఅవుట్, ఇండస్ట్రియల్ ఫీడర్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఈ నెల 27న మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని బోరవానిపాలెం, పాత పరదేశిపాలెం, కొత్త పరదేశిపాలెం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించినట్లు వైసిపి సమన్వయకర్త కె కె రాజు తెలిపారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి, మిగతా సమస్యలపై అర్జీలు తీసుకుని, సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలో పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

వీరానగర్ ఇళ్లకు పన్నులు వేయాలి

- వారం రోజుల్లో స్పందించకుంటే జివిఎంసి జోనల్ కార్యాలయంలో నివాసం
- ధర్నాలో సిపిఎం కార్పొరేటర్ గంగారావు

వీరానగర్ వాసుల ధర్నాలో సిపిఎం కార్పొరేటర్ గంగారావు, ఇతర నేతలు

ప్రజాశక్తి- వేపగుంట : వీరానగర్ కాలనీకి వారం రోజుల్లో ఇంటి పన్నులు వేయకుంటే, జోనల్ కార్యాలయాన్నే ఇల్లుగా మార్చి అందులో నివాసముంటామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు హెచ్చరించారు. సోమవారం జివిఎంసి ఎనిమిదో జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, 97వ వార్డు పరిధిలోని వీరానగర్‌లో పదేళ్లుగా 50కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. వీరి ఇళ్లకు పన్నులు వేయకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని, దీనిపై అనేక దఫాలుగా అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు చెప్పుకున్నా ఫలితం లేదని వాపోయారు. దీనిపై గతంతో జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, వారం రోజుల్లోపు వీరానగర్‌లోని ఇళ్లకు పన్నులు వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జోనల్ కార్యాలయంలో నివాసమేర్పరచుకుంటామని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి బి రమణి, కె అప్పలనాయుడు, శ్రీను, గౌరినాయుడు, అప్పారావు పెద్దసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

జిఒ 296 పట్టాలపై రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలు ఎత్తేయాలి

ప్రజాశక్తి -గాజువాక : జిఒ 296 పట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు తక్షణమే ఎత్తేసి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం గాజువాక పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, టిడిపి హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా గాజువాక నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఆక్రమణలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కు కల్పించేందుకు జిఒ 296.జారీచేసి, 12వేలమందికి పట్టాలిచ్చిందన్నారు. ఆ తర్వాత వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు నిబంధన పెట్టిందన్నారు. గడువుదాటిపోయినా ప్రస్తుత ప్రభుత్వం స్పందించకపోగా, వాటిపై కొత్త ఆంక్షలు పెట్టిందన్నారు. తక్షణమే జిఒ296పై ఆంక్షలు ఎత్తేయాలని కోరారు. అలాగే గాజువాక భూసమస్యకు సంబంధించి జిఒ301 కింద నిర్ణీత రుసుము చెల్లించిన 1500 మంది లబ్ధిదారులకు తక్షణమే పట్టాలు పంపిణీ చేయాలని కోరారు.కార్యక్రమంలో గాజువాక నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షులు తమరి శివప్రసాద్,కూన వెంకటరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కణమాం గ్రామంలో విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పునరుత్పాదక శక్తి సంరక్షణ, తక్కువ విద్యుత్ వినియోగంపై వివరించారు. ఎల్ఇడి బల్బులను పంపిణీ చేశారు. ఇంకుడు గుంతలు నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎస్ఎస్ఆర్‌టి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, డైరెక్టర్ రాజ మురుగదాస్, ఎన్ఎస్ఎస్ పిఒ హరగోపాల్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన స్థలం అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ కొండపేటలోని అంబేద్కర్ భవన స్థలం అన్యాక్రాంతంపై సర్వే నిర్వహించి, ఆక్రమణలను తొలగించాలని టిడిపి ఎస్సి సెల్ నేతలు నరవ రామారావు, తాటి పూడి అప్పలరాజు కోరారు. సోమవారం టిడిపి పార్లమెంటరీ కార్యదర్శి పిట్టా సురేష్‌తో కలిసి, జిల్లా కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అంబేద్కర్ భవన పునర్నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో ఆక్రమణపై సర్వేచేసి హద్దులను గుర్తించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

రూ.100 కోట్లతో గీతం ప్రాంగణాలలో 'మూర్తి' పరిశోధనా కేంద్రాలు

పరిశోధనలపై వివరిస్తున్న విసి దయానంద సిద్ధవట్టం

ప్రజాశక్తి - మధురవాడ : విజ్ఞాన శాస్త్ర పరిశోధనల బలోపేతం, అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ సాధనే లక్ష్యంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో రూ.100 కోట్లతో మూర్తి పరిశోధనా కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తెలిపారు. సోమవారం స్థానిక . గీతం మూర్తి పరిశోధన కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధనలలోనూ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామన్నారు. అత్యున్నత స్థాయి పరిశోధనలు నిర్వహణకు వివిధ కేంద్ర పరిశోధనా సంస్థలలో కీలక స్థానాలలో పనిచేసిన వారిని డీన్‌లుగా, విశిష్ట ప్రొఫెసర్‌లుగా, అలాగే పోస్ట్ డాక్టోరల్ పరిశోధకులను ఏడాదిగా గీతం ప్రాంగణాలలో నియమిస్తూ వచ్చామని వెల్లడించారు. గీతంలో పరిశోధకులుగా (పిహెచ్‌డి) ప్రవేశం పొందే వారిలో ప్రతిభ గలవారిని గుర్తించి మూర్తి ఫెలోషిప్‌ను కూడా అందజేస్తున్నామన్నారు.

28న బెంగళూరు గీతం ప్రాంగణంలో మూర్తి పరిశోధన కేంద్రం ప్రారంభం

ఈ నెల 28న బెంగళూరు గీతంప్రాంగణంలో మూర్తి పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు విసి వెల్లడించారు. గీతం వేదికగా వివిధ పరిశ్రమలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా 13 అంశాలపై పరిశోధన ప్రయోగ శాలలు నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. వాటిలో డ్రోన్ టెక్నాలజీ, భూసారం, జియో–స్పేషియల్, స్మార్ట్ అగ్రికల్చర్, నానో సెన్సార్ ఫొటోనిక్స్, బయోసెన్సార్. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్. అప్లైడ్ ఎలక్ట్రోమాగ్నటిక్. 3డి ప్రింటింగ్ డిజైన్. ఆల్జీబ్రా, జియోమెట్రీ. క్వాంటమ్ ఇన్ఫోకామ్. నెక్ట్స్ జనరేషన్ కనెక్టివిటీ రీసెర్చి ల్యాబ్‌లకు సంబంధించి పరిశోధనలు చేపట్టనున్నట్లుం విసి తెలిపారు. వీటి కోసం పరిశ్రమలతో చర్చిస్తున్నామన్నారు.

విదేశీ విద్యకు 'దివీస్' ఆర్థిక సాయం

చెక్కును ఇస్తున్న దివీస్ జిఎంకోటేశ్వరరావు

ప్రజాశక్తి -తగరపువలస: విదేశాలలో ఉన్నత చదువులకు అవకాశం వచ్చినా, వెళ్లేందుకు ఆర్థికస్థోమత లేని ఒక ప్రతిభ కలిగిన విద్యార్థిని చిప్పాడలోని దివీస్ సంస్థ అండగా నిలిచింది. రూ.10లక్షల ఆర్థికసాయం అందజేసింది. ఈ మేరకు సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు సోమవారం చెక్కును అందజేశారు.లండన్‌లోని నార్త్ ఉంబ్రియా యూనివర్సిటీలో ఎంఎస్‌సి బిగ్ డేటా సైన్స్ చేసేందుకు భీమిలి మండలం , అన్నవరం గ్రామానికి చెందిన మూగి శివశంకర్‌కు అవకాశం వచ్చింది. లండన్ వెళ్లి చదివేందుకు ఆర్థిక స్తోమత లేని శివశంకర్‌కు దివీస్ సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. ఈ సందర్భంగా దివీస్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు మాట్లాడుతూ, విద్యను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ ఎం సంతోషికుమారి, వైసిపి నాయకులు ఎం ఎల్లాజీ, నరసింగరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు

జూనియర్ లైన్‌మ్యాన్‌కు న్యాయం చేయాలి

- ఘటనపై సమగ్ర విచారణకు కుటుంబ సభ్యుల డిమాండ్

ఆసుపత్రిలో విషమస్థితిలో ఆలీ

ప్రజాశక్తి - సీతమ్మధార : విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఎపిఇపిడిసిఎల్ రెండో జోన్‌కంచరపాలెం సెక్షన్ జూనియర్ లైన్‌మ్యాన్ సయ్యద్ ఆలీకి న్యాయం చేయాలని బంధువులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు. శనివారం 11కెవి విద్యుత్‌లైన్‌లో విధి నిర్వహణలో ఉండగా విద్యుత్‌షాక్‌కు గురై స్తంభం పైనుంచి జారి పడడంతో ఆలీఇ తీవ్రగాయాలయ్యాయి. ఆరిలోవ పినాకిల్ ఆసుపత్రిలో విషమస్థితిలో ఆలీ చికిత్స పొందుతున్నాడు.

జివిఎంసి 77వ వార్డు, చిన్నపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ ఆలీ 2021లో జూనియర్ లైన్‌మ్యాన్‌గా ఉద్యోగం పొందారు. శనివారం విధుల్లో ఉండగానే ప్రమాదానికి గురికావడంతో వెన్నెముక దెబ్బతిని చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని ఆలీ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు, ఎపిఇపిడిసిఎల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కళింగ సేవా సంఘం నూతన కార్యవర్గం

కళింగ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ: కళింగ సేవా సంఘం అధ్యక్షులుగా శివశక్తి నగర్ ప్రాంతానికి చెందిన బగాది లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జివిఎంసి ఐదవ వార్డు చిలుకూరి లేఅవుట్‌లోని కళింగ సామాజిక భవనంలో విశ్రాంత ఎస్‌సి ప్రసాదరావు, అటవీ శాఖ అధికారి బిర్లంగి నరేష్ ఆధ్వర్యంలో మధురవాడ కళింగ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా బగాది లక్ష్మణరావు (బిఎల్ఆర్), గౌరవాధ్యక్షులుగా అయోధ్య నగర్‌కు చెందిన సిపాన వెంకటరమణ, కార్యదర్శిగా సాయిరాం కాలనీకి చెందిన గురుగువెల్లి యోగేశ్వరరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి రంగారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు లక్ష్మణరావు మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా సమిష్టిగా సమస్యలను పరిష్కరించుకుందామన్నారు.

ఆగిన ఆర్‌టిసి బస్సు

నిలిచిన బస్సు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో సోమవారం నర్సీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సు ఇంజన్ నుండి అకస్మాత్తుగా పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేసి విద్యార్థులను కిందకి దింపేశారు. స్కూల్ పిల్లలు కావడంతో విద్యార్థులు భయాందోళన చెందారు.విద్యార్థులు బస్సు పాస్ పై ప్రయాణించేవారు కావడంతో ఆటోలో ప్రయాణించేందుకు చార్జీలకు డబ్బులు లేక ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా నర్సీపట్నం వెళ్లే బస్సులు తక్కువగా ఉండటం, పాఠశాల సమయం కావడంతో కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఆందోళన చెందారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కండీషన్‌లో ఉన్న బస్సులు వేయడంతో పాటు పాఠశాలకు వెళ్లే సమయంలో బస్సులు పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

అక్రమ నిర్మాణాల నిలుపుదలకు వినతి

వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సిటీ క్లబ్ రెవెన్యూ స్థలంలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని నర్సీపట్నంకు చెందిన కాళ్ల లోవరాజు, పాకలపాటి అరవింద్, కుమార్ రాజు కోరారు. సోమవారం స్పందనలో ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. గతంలో షాపుల నిర్మాణం చేసినప్పుడు మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ 11 షాపులతో కూడిన వాణిజ్య సముదాయ నిర్మాణం చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని, సిటీ క్లబ్ వారితో లాలూచీపడి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.ఈ ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించాలని కోరారు.

హైస్కూల్‌కు ప్రింటర్ వితరణ

ప్రింటర్‌ను ఇస్తున్న కమల

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ ఉపాధ్యాయిని దంపతులు ప్రింటర్ బహుమానంగా అందించినట్లు ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగన్నదొర తెలిపారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేసిన టి.కమల దంపతులు పాఠశాలకు 15000 రూపాయలు విలువ చేసే హెచ్ పి లేజర్ ప్రింటర్‌ను సోమవారం బహుకరిం చారు. పాఠశాలలో పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయిని కమల పాఠశాల అవసరంను గుర్తించి తన వంతు సహకారంగా ప్రింటర్‌ను అందించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ ధూళి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుందూరు రాజు, మహేశ్వరీ, సుధాలక్ష్మి, సుబ్బలక్ష్మి, పద్మావతి, భవాని, అనిత, తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం ప్రదర్శించ వద్దని ఆర్డీవో జయరాం సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, భూసమస్యలపై పదేపదే రైతులను తిప్పడం సరికాదన్నారు. నిర్ణీత వ్యవధిలో సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. పరిష్కారం కానీ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

'ఉపాధి' హామీ పనులు ప్రారంభం

పనులు చేపడుతున్న కూలీలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: వేసవి ప్రారంభం కావడంతో ఉపాధి హామీ పనులు ప్రారంభించినట్లు వీఆర్పీ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం భీమవరం గ్రామరెవెన్యు పరిధిలోని రైల్వే కట్ట వద్ద నున్న కాలువ వద్ద మూడు గ్రూపులకు చెందిన సభ్యులు పనులు చేపట్టారు. వంద రోజులు పూర్తి కాని గ్రూపులతో ముందుగా పనులు చేపట్టామన్నారు. ఏప్రిల్ నెల నుండి మరల పూర్తిస్థాయిలో అన్ని గ్రూపులు పనులు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా కన్వీనర్ గరగా శ్రీను, వార్డు మెంబరు మేట్ వేగి వెంకటరమణ, మేట్‌లు మూకురపు చిట్టమ్మ, వడ్లమూరి లక్ష్మి కూలీలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో ఇప్పటివరకు గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరూ కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బొట్టా నాగరాజు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నంలో కనీస వసతులు కూడా లేవని దుయ్యబట్టారు. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రజాప్రతినిధులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొల్లు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ వాడపల్లి, ఎన్.అప్పారావు, సిహెచ్.రాజు , తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై కళాజాతా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం వారపు సంతలో ఐసిడీఎస్ సూపర్ వైజర్ సత్యశ్రీ ఆధ్వర్యంలో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై సోమవారం కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వడ్డాది:

బుచ్చయ్యపేట మండలం మంగళాపురంలో గ్రామంలో సర్పంచ్ కంటే పద్మరేఖ ఆధ్వర్యాన కళాజాతా నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం.బాలికలను చదివిద్దాం..బాల్యవివాహాలను నిర్మూలిద్దాం అంటూ కళాజాతా బృందం కళాకారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎసిడిపిఒ పుష్ప, సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి, జిఎంఎస్‌కె మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రాధ, మహిళలు, పాల్గొన్నారు.

మంగళాపురంలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

సన్మానం చేస్తున్న అధికారులు

ఉప తహశీల్దార్ శ్యామ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల తహశీల్దారు కార్యాలయం ఆవరణలో బదిలీ అయిన ఉపతహశీల్దార్ శ్యాం కుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. వీఆర్వో సంఘ సభ్యులు, రేషన్ డీలర్ల సంఘ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీఆర్వో సంఘం అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ, శ్యామ్ కుమార్ ఉపతహశీల్దారుగా, ఇంఛార్జ్ తహశీల్దారుగా పని చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో, ఈవోపిఆర్డీ మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిల కోసం వినతి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొంతలం గ్రామంలోని కోరుకుండవీధిలో ఇంటింటికి కుళాయి కలెక్షన్లు ఇవ్వాలని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు సోమిరెడ్డి బాబ్జి, సీనియర్ నాయకులు గూడుపు రామవెంకట సత్యనారాయణ, పార్టీ మండల సెక్రెటరీ కేసరపూడి శివాజీలు కోరారు. సోమవారం కొంతలం పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అదనపు డిస్ట్రిక్టు జడ్జి వారి కోర్టులో
I.A. No. 771/2023 in O.S. 59/2023

Between:
మెండు శ్రీ సూర్య వెంకట సత్య గనిరాజు, వగయిరా -వాద్లు/పిటీషనర్లు
AND
బర్రే వీర్రాజు @ విజ్జిబాబు, వగయిరా -ప్రతివాద్లు/రెస్పాండెంట్లు

R-3: బి.సుందర రాజన్, S/o. బాలసుబ్రహ్మణ్యం, వయస్సు 49 సం॥లు, డో.నెం. 16–4–16/17, ఎఫ్1, షణ్ముఖ టవర్స్, అఫీషియల్ కాలనీ, మహారాణిపేట, విశాఖపట్నం, విశాఖ DMC.

పై నంబరు పిటిషన్‌లో 3వ రెస్పాండెంట్‌కి ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారి ఎదుట **ది. 15-03-2024 ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనిచో దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

అల్లం గనిరాజు, పిటీషనర్ల అడ్వకేటు
రామచంద్రపురం రామచంద్రపురం
24-02-2024 సెల్: 9182022951

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అదనపు డిస్ట్రిక్టు జడ్జి వారి కోర్టులో
O.S. 59/2023

Between:
మెండు శ్రీ సూర్య వెంకట సత్య గనిరాజు, వగయిరా -వాద్లు
AND
బర్రే వీర్రాజు @ విజ్జిబాబు, వగయిరా -ప్రతివాద్లు

D-3: బి.సుందర రాజన్, S/o. బాలసుబ్రహ్మణ్యం, వయస్సు 49 సం॥లు, డో.నెం. 16–4–16/17, ఎఫ్1, షణ్ముఖ టవర్స్, అఫీషియల్ కాలనీ, మహారాణిపేట, విశాఖపట్నం, విశాఖ DMC.

పై నంబరు దావాలో 3వ ప్రతివాదికి ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారి ఎదుట **ది. 15-03-2024 ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనిచో దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

అల్లం గనిరాజు, వాద్లు అడ్వకేటు
రామచంద్రపురం రామచంద్రపురం
24-02-2024 సెల్: 9182022951

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు.
E.P.26/2022 IN O.S. 48/2014

బిట్వీన్:
మెండా విజయలక్ష్మి ....డి.హెచ్.ఆర్
ఎండ్:
తూముల చిన్నవాడు ....జె.డి.ఆర్
To,
తూముల చిన్నవాడు తండ్రి లేటు పైడియ్య వయస్సు 70 సం॥లు, రిటైర్డ్ ఉద్యోగి, ఎడిషినల్ న్యూ గొడైన్ & పోర్టు ఏరియా, విశాఖపట్నం

పై నెంబరు అమలులో యిందలి జె.డి.ఆర్‌పై రిటైర్మెంటు బెనిఫిట్స్ ఎటాచ్ చేయమని తమ కోర్టులో ఈ.పి. దాఖలు చేసియున్నారు. సదరు అమలులో **తేది.22-03-2024 న** కోర్టు వారు వాయిదా వేసి యున్నారు. కావున **ఉదయం 10.30 గం॥**లకు పైన తెలిపిన కోర్టునందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయి, అక్షేపణలు ఉన్న ఎడల తెలుపు కొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు సదరు వాజ్యమును తీర్మానించబడును .

(శ్రీ కోర్టువారి ఉత్వర్వు ప్రకారం)

కె.ప్రసాదరావు
బొబ్బిలి, డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్
తేది: 26/2/2024 బొబ్బిలి

IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE, AT VIJAYAWADA
I.P. NO. 56/2022

Between :
Yenuga Praveen .... Petitioner
And
R1) M. Appala Raju, R/o Plot No. 102, Sukhibhava Layout, Near Gayatri Temple, KummaraPalem, Bhimili,
and others . ... Respondents

పై నెంబరులో గల పిటీషనర్ తనను ఇన్సాల్వెంట్‌గా ప్రకటించమని శ్రీ కోర్టువారి ఎదుట పిటీషన్‌ను దాఖలు పరిచినాడు. ఇందులోని రెస్పాండెంటు నెం.1 అయిన M. Appala Raju, R/o Plot No. 102, Sukhibhava Layout, Near Gayatri Temple, KummaraPalem, Bhimili వారు శ్రీ కోర్టువారి నోటీసులు అందుకొనక జాప్యం చేయుచున్నారు. సదరు రెస్పాండెంటు నెం.1 వారు శ్రీ కోర్టువారి ఎదుట హాజరు కావడానికి ది.07-03-2024వ తేదీన వాయిదా వేసినారు. కావున రెస్పాండెంటు నెం.1 వారు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ ది. 07-03-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల రెస్పాండెంటు నెం.1 పరోక్షమున తీర్మానించెదరు.
వాయిదా : 07-03-2024
శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో ప్రకటించటమైనది.

ఇట్లు
ఆర్.వి.రామకృష్ణ,
జె.దిలీప్ కుమార్,
అడ్వకేట్స్, విజయవాడ-2.
సెల్ : 94401 75910

IN THE HONOURABLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 239/2021 in D.R. 391/2013

Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd.
Seethammapeta Branch, VSP-16
. . . Petitioner / DHR
And:
Mr.Ch.Aswani Kumar Raju & 5 Others
. . . Respondent / JDRS
R.54 Notice to JDRS 8 to 10
LR'S
JDR-8: Mr. Ch. Aswani Kumar Raju, S/o. Late Suryanarayana Raju, Hindu, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.
JDR-9: Mr. Chakrala Sirishna, D/o. Late Suryanarayana Raju, a/a 38 years, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.
JDR-10: Mr. Chakrala Pradeep, D/o. Late Suryanarayana Raju, Hindu, a/a 36 years, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.

ఇందుమూలంగా మీకు తెలియపరుచునది ఏమనగా కోర్టు వారి Order 0.21 R-54 ప్రకారం మీకు నోటీసు ఆర్డర్ చేసియున్నారు. సదరు అమలు పిటిషను **తేది 11-03-2024** వాయిదా అయివున్నది. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** పై వాయిదా రోజు హాజరై మీ ఆక్షేణలు తెలియపరుచుకోవలెను. లేనిఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

SCHEDULE OF PROPERTY
RCC Slabbed house consisting of Ground Floor constructed over total site 100 Sq. yards, situated in D.No. 8-157/12, Old D.No. 14-1-88, Varalakshmi Nagar, Vepagunta, in S.No. 24/3D/2/P, of Varalakshmi Nagar, Vepagunta in GVMC ward no. 70 is bounded as follows:
East: Property of Pasumarthi Appala Raju
West : Municpal Road
North: Plot No. 18 of T.Vanaja Kumari
South : Plot No. 19
Measuring about 600 Sq.feet is in the possession of the legal representatives i.e., 8th to 10th judgment debtors who are the deceased 5th judgement debtor

(By Order of Court)
M/s. PPS ASSOCIATES
P.MURALI GOPAL
Y.SUJATHA, J.V.PREMASAI
Advocates, D.No. 49-10-20,
Lalitha Nagar, Visakhapatnam.

3న పల్స్ పోలియో

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలో మార్చి 3వ తేదిన ఐదేళ్లలోపు చిన్నారులకు వేసే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజారోగ్య అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ ఆదేశించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో డిఎంఒహెచ్ జి.జగదీశ్వరరావు, సంస్థ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు, యుపిహెచ్‌సి అధికారులతో మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర పరిధిలో 8 జోన్లలో ఉన్న 72 యుపిహెచ్‌సిలలోను 813 బూత్‌లలో 36 ట్రాన్సిట్లను ఉపయోగించి 1,17,687 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. మార్చి 3వ తేదీన ఉదయం 6 సాయంత్రం 6 గంటల వరకు బస్ స్టేషన్‌లోనూ, రైల్వే స్టేషన్‌లోనూ, పబ్లిక్ ఉన్న ప్రాంతాల్లోనూ, రైతు బజార్లోనూ చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టిడిపి, జనసేన పొత్తు

వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తు కోసమే టిడిపి, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని జనసేన విశాఖజిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. దీన్ని చూసి ఓర్వలేని అధికారపార్టీ నాయకులు నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాపులను రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో కాపులు తమ సత్తా చూపిస్తారన్నారు. పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం మీద మాట్లాడటం అభ్యంతరకరమన్నారు. తమకు తక్కువ సీట్లు కేటాయించారని అంటున్నారని, కేటాయించిన అన్ని సీట్లు గెలుస్తాం అన్న క్లారిటీ తమకు ఉందన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి నిధులు ఇవ్వకుండా గాలికి వదిలేశారని(?) చెప్పారు. యాదవభవన్ భూమిపూజలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ రాకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. అనిల్ యాదవ్ మంత్రి పదవిని తొలగించి యాదవులకు ఏమి సందేశ మిచ్చారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంగపూడికి బెదిరింపు కాల్ వచ్చినా తాము భయపడేది లేదన్నారు. విశాఖ నగరంలో రౌడీయిజం చెలరేగుతోందని(?) అన్నారు. మీడియా సమావేశంలో ఉత్తర నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్లు భీసెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షులుగా దేవర నాగసునంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షులుగా దేవర నాగసునందను నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు లామ్ తాంతియా కుమారి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధినాయకులు చేసిన సూచనల ప్రకారం తాను పనిచేస్తానని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రీకారం(?) లేకుండా కృషి చేస్తానని ఆమె చెప్పారు.

పేదలకు పలు పథకాలు

ప్రజాశక్తి-గొలుగొండ: బిజెపి ప్రభుత్వం దేశంలోని పేదల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు పరమేశ్వరరావు తెలిపారు. సోమవారం కేడిపేటలో బిజెపి పోరు యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు వర్మ, కొండబాబు, నర్సీపట్నం కన్వీనర్ తమరాన ఎర్రినాయుడు, వెంగా జగన్నాధం, ప్రజాపోరు యాత్ర కన్వీనర్ గవిరెడ్డి త్రినాధ్, పల్లా రమణ యాదవ్, మండల అధ్యక్షుడు చందక గౌరినాయుడు, రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలివెళ్లిన వైసిపి నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల: అడ్డురోడ్డులో ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి నిర్వహించిన సభకు వైసిపి శ్రేణులు భారీ సంఖ్యలో వెళ్లారు. మండల వైసీపీ అధ్యక్షులు కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులకు గృహ లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పిఎం జన్ మన్ పథకం కింద పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు నిర్మాణానికి అడ్వాన్స్ బిల్లు రూ70 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ లింబగుడా గ్రామంలో లబ్ధిదారులతో సర్పంచ్ చిన్నబాబు ధర్నా నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గిరిజన పివిటిజి తెగలకు పిఎం-జన్ మన్ పథకం కింద దేశంలో 18 రాష్ట్రాలలో 24 వేల కోట్లు తో మంజూరు చేస్తున్నట్లు ప్రచారం చేస్తూ అరకులోయ మండల కొత్తబల్లుగుడా గ్రామానికి సంబంధించిన దేశ ప్రధాని చేతుల మీదుగా వర్చువల్లో అట్ట హాసంగా ప్రారంభించారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు తమ ఖాతాలో రూ 70000 జమ అయినట్లు మెసేజ్ లు వచ్చాయన్నారు. కొత్తబల్లుగుడా సమావేశంలో మెసేజ్‌లు వచ్చిన ప్రతి ఒక్కరికి డబ్బులు జమ అయ్యాయని అధికారులు చెప్పడంతో వీటిని చూసి లబ్ధిదారులు తమకు ఉన్న ఇళ్లను కూల్చి పునాదులు తవ్వడానికి సిద్ధం చేసుకున్నారని తీరా నగదు జమ కాకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి రాజు బాబు, లింబగుడా గ్రామస్తులు పి.రాధ, పి.సింగో, పి.బాబురావు, లబ్ధిదారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధంపై మాట తప్పిన జగన్

టిడిపి

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : మద్యనిషేధంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత ఎన్నికల్లో మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానని హామీ ఇచ్చిన జగన్ ఏటా మద్యం షాపులు పెంచారు, తప్ప నిషేధించలేకపోయారని విమర్శించారు. మూడు సార్లు మద్యం రేట్లు పెంచారన్నారు. నాసిరకం మద్యం తాగి సుమారు 30 వేలు మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది అనారోగ్యం బారిన పడ్డారని చెప్పారు. జగన్ ధనదాహం కోసం సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి బహిరంగంగా 99 టిక్కెట్లు ప్రకటించారని, వైసిపి సమన్వయకర్తలను మార్చడం(?) ప్రకటిస్తోందని ఎద్దేవాచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజమండ్రి నారాయణ పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

అరకులోయ రూరల్: వైసిపి ప్రభుత్వం కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని, సొంత బ్రాండ్‌లను తయారు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సివేరి దొన్ను దొర విమర్శించారు. సోమవారం అరకువేలి మండల కేంద్రం టిడిపి, జనసేన సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడారు. కల్తీ మద్యం తాగి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంఛార్జి శెట్టి చిరంజీవి, అరకువేలి మండలాధ్యక్షులు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి, అరకువేలి మండల అధ్యక్షులు అల్లంగి రామకృష్ణ పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం ఏదీ

పాడేరు: మండలంలోని ఐదిమిల(?) పంచాయతీ ఐదిమిల కాలనీ, ఇసుకగరువు, కొలంబో(?), సాగుపట్టు గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ, పాత బ్రాండ్లను నిషేధించి, కొత్త బ్రాండ్లు తెచ్చి ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేయడమే మద్యపాన నిషేధమా అని జగన్మోహన్ రెడ్డి ని ప్రశ్నించారు. ఆనాడు మద్యపాన నిషేధం చేస్తానని చెయ్యకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటు అడగను అని చెప్పి ఇప్పుడు మర్చిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రమ్మ, రమణమూర్తి, మాజీ సర్పంచ్ గొండెలి నారాయణ, మాజీ సర్పంచ్ వర్తనపిన్ని దొర, కించే రమణ, కిలో భాస్కర్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలి

- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : నిర్ణీత సమయంలో ప్రజలు పెట్టుకున్న అర్జీలను పరిష్కారించాలని జివిఎంసి అధికారులకు నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యలయంలో జరిగిన "డయిల్ యువర్ మేయర్", "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమములో పాల్గొని ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "డయిల్ యువర్ మేయర్" కు 13, "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంలో 104 ఆర్జీలు స్వీకరించినట్లు తెలిపారు, డయిల్ యువర్ మేయర్ కార్యక్రమములో అదనపుకమిషనరు (పబ్లిక్ హెల్త్) 1, అనకాపల్లి జోన్ 1, ఇంజినీరింగు విభాగామునకు 2, పట్టణ ప్రణాళిక విభాగమునకు 2, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ 3, డిసి(ఆర్) 1, పిడి(యుసిడి) విభాగం 3, మొత్తం 13 కాల్స్ వచ్చాయని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఒకటవ జోన్ కు 2, రెండవ జోన్ 19, మూడువ జోన్ 20, నాల్గవ జోన్ 12, ఐదవ జోన్ 14, ఆరవ జోను 13, ఎడవ జోన్ 1, ఎనిమిదివ జోన్ నుంచి10, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. పరిపాలనా విభాగానికి 6, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం3, పట్టణ ప్రణాళిక విభాగం 51, ఇంజినీరింగ్ విభాగం 15, మొక్కల విభాగానికి 3, యుసిడి విభాగానికి 18 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

3 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సోమవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు జరగనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ తెలిపారు. ఎల్‌డిఎం ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను, బ్యానర్‌ను సోమవారం జెసి ఛాంబరులో ఆయన ఆవిష్కరించారు. 2024-25 సంవత్సరానికి గాను భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఎస్‌బిఐ ఆధ్వర్యాన జిల్లాలో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు జెసికి వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం, సిబ్బంది పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కంచరపాలెంలో ఉపాధి కార్యాలయంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యాన ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు పది ప్రముఖ కంపెనీలు సుమారు 600 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైనన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబిఎ, బీటెక్, ఐటిఐ, డిప్లమో బి / డి /ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారంతా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా రూ.10వేల నుంచి రూ.35వేల వరకు జీత భత్యాలుంటాయని, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, తుని ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని వివరించారు. 18నుంచి 35ఏళ్ల మధ్య వయస్సున్నవారంతా హాజరు కావచ్చని, మరిన్ని వివరాలకు 85558 68681 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు స్కిల్ యూనివర్శిటీ డాట్ ఏపీ ఎస్ఎస్‌డిసి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిట్ కార్డుతో హాజరవ్వాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

వైవి.సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని సోమవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో వైసిపి నాయకులు సంపత్ రాజు, బోని రామారావు, అవనాపు విజయ భాస్కర్, ఎర్నింటి నర్సింగరావు, మద్దిల అప్పలనాయుడు, సాధు కృష్ణ, మద్దిల దుర్గారావు, సముద్రపు వెంకటరమణ, సిరిశెట్టి పైడిరాజు, కొప్పల రాము, వంక అప్పలరాజు, సుంకరి విజయ్, సంపత్ ఖాదర్ ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు ప్రారంభించడం ఒక వరమని రైల్వే విభాగాధిపతి, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ పి.శ్రీనాథ్ తెలిపారు. మండలంలోని సోమవారం పెదబోదుగల్లం రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం ఎన్.హెచ్ 16 కలుపుతూ ప్రధాని మోడీ వర్చువల్‌గా జాతికి అంకితం చేశారన్నారు. రైల్వే క్రాసింగ్‌ల స్థానంలో అండర్ బ్రిడ్జిలు నిర్మించడంతో భద్రతకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. పెదబోదుగల్లం హైస్కూలు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ అధికారులు తాతారావు, సంతోష్, వర్మ, రమేష్, శ్రీనివాసరావు, రామకృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, ఎంఈఓ కె.నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రైల్వే విభాగం ఎ.అప్పారావు, హెచ్‌ఎమ్. సి.హెచ్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సారంపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని ఏకలవ్య నోడల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భూసారం, భూసార పరీక్షా విధానం ఉపయోగాలపై వ్యవసాయ సాంకేతిక జిల్లా యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.అషా దేవి అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.విజయ లక్ష్మి మట్టి నమూనా తీయు విధానంపై వివరించారు.సేంద్రీయ ఎరువులతో కలిగే మేలుపై తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.కేశవరావు, పెదబయలు మండల వ్యవసాయ అధికారి అద్దె శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు అనూష, శైలజ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ప్రభుత్వ శాఖ ఉద్యోగాల్లో గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఒంటిపాక జంక్షన్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఒంటిపాక గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జీవో 3 తో పాటు ప్రత్యేక గిరిజన స్పెషల్ డిఎస్సి భర్తీ చేయాలని ఆ గ్రామ యువత ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పందనకు నాలుగు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వాటిని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగానికి పంపించినట్లు తెలిపారు.

3న 'పెందుర్తి వైపు చూడు'

ప్రజాశక్తి- పెందుర్తి : వచ్చేనెల 3న 'పెందుర్తి వైపు చూడు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సోమవారం తాండ్రపాపారాయుడు కల్యాణమండపంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా 15వేలమందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ జాతీయ కార్యవర్గం

ప్రజాశక్తి- సీతమ్మధార : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా 11వ బౌద్ధ మహా సమ్మేళనం రెండో రోజు కార్యక్రమలో భాగంగా సోమవారం నగరంలోని బుల్లయ్య కాలేజీ దరి అంబేద్కర్ భవన్‌లో సంస్థ జాతీయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నూతన కేంద్ర కమిటీ ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబోధి పాటిల్, ట్రస్టీ ప్రధాన కార్యదర్శిగా బికె.బరేవ్, కోశాధికారిగా శంకరరావు దొంగేరెలపే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలోని మిగతా వారిని త్వరలో ఎన్నుకోనున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కలలుగన్న ప్రబుద్ధ భారత్ నిర్మాణం కోసం కృషి చేయడంతోపాటు, బుద్ధుని సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నూతన కమిటీ నిర్ణయించింది.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి-ఆనందపురం: కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని శొంఠ్యాం ఎంపిటిసి పల్లా రమణకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.10లక్షల ఆర్థికసాయం చెక్కును సోమవారం రమణ కుమారుడు పల్లా దుర్గాప్రసాద్‌కు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. రమణ అనారోగ్య సమస్య తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్స్ చేసి ఆర్థికసాయం మంజూరయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టికి రమణ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాట్ల పెదబాబు, బోని బంగారనాయుడు, మజ్జి వెంకటరావు, బిఆర్‌బి నాయుడు, పాండ్రంగి శ్రీను, లంక రాంబాబు, ముసలి నాయుడు పాల్గొన్నారు

శీతల్ స్వర్ ఈవెంట్స్' ప్రారంభం

జ్యోతి ప్రజ్వలనల చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరానికి చెందిన గాయని బి.లక్ష్మీ స్వరూప సారథ్యంలో 'శీతల్ స్వర్ ఈవెంట్స్' పేరిట నూతన సంగీత సంస్థ సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో ప్రారంభమైంది. విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్షులు భయ్యా శ్రీనివాస్, ముఖ్య సలహాదారు సన్ మూర్తి, సంస్థ కార్యదర్శి బి శ్రీనివాస్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు లెఫ్టినెంట్ లోకేష్, వెంకట్, అప్పారావు, బాబ్జి, అలిపిల్లి నరసింగరావు, శ్రీదేవి, నాయుడు, రమణి, మాధురి, సత్యవతి, లక్ష్మణ్, రాజారావు, భయ్యా శ్రీనివాస్, బొట్టా నాగేశ్వరరావు తదితరులు పాత కొత్త గీతాలను ఆలపించి, అలరించారు. కార్యక్రమంలో చెక్క రమాదేవి, మంజుల, ఎం వి రాజశేఖర్ పెద్దసంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు



వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటోజోన్, నాలుగు వార్డుల్లోని 393 మంది వాలంటీర్లకు స్థానిక ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు సేవా పురస్కారాలు అందజేశారు. సోమవారం చిట్టివలస బంతాట మైదానంలో 385 మంది సేవామిత్ర, ఆరుగురికి సేవా రత్న, ఇద్దరికి సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేసి, అభినందించి సత్కరించారు. వాలంటీర్ల సేవలను కొనియాడారు. జెడ్‌సి కె కనక మహాలక్ష్మి, యుసిడి, ఎపిడి వై సంతోష్‌కుమార్, ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, కో ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, జగుపిళ్ళ ప్రసాద్, జివి రమణపాల్గొన్నారు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రామ వాలంటీర్లకు సేవా అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామ జోగినాయుడు, మల్ల జోగారావు, చీర రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవులకు ప్రాధాన్యత ఇవ్వకుంటే స్వతంత్రంగా పోటీ

సంఘీభావం చెబుతున్న యాదవ సంఘం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అన్ని రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదని, రానున్న ఎన్నికల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలను కలుపుకొని 100 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ స్పష్టం చేశారు. స్థానిక విజయ రెసిడెన్సిలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటుకు రెండు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బర్నికాన సాధురావ్, సబ్బి శ్రీనివాసరావు, పంచదార్ల సూరిబాబు, బంధం వెంకటరమణ, గోకివాడ శ్రీరాములు, బర్నికాన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఓట్లు కోసమే యాగీ!

ఆరిలోవ : నగరంలో యాదవుల ఓట్ల కోసమే హడావిడిగా యాదవ భవనానికి శంకుస్థాపన, వరాలు ప్రకటన వంటి యాగీ చేస్తున్నారని విశాఖ జిల్లా యాదవ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ప్రసాదాల భాగ్యానంద్ ఆరోపించారు. సోమవారం ఆరిలోవ, తోటగరువు రాధాకృష్ణ కల్యాణ మండపం వద్ద యాదవ సంఘం ఐక్యవేదిక నాయకులు కోడిబోయిన బాబ్జి, ఒమ్మి చిన్నారావు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అధిక శాతం జనాభా ఉన్న యాదవుల పట్ల అన్ని పార్టీలు చిన్నచూపు చూస్తున్నారన్నారు. విశాఖ తూర్పు అసెంబ్లీ స్థానాన్ని అక్కరమాని విజయనిర్మలకు కేటాయిస్తే అన్ని సంఘాలు కలిసి పనిచేస్తాయన్నారు.లేకుంటే స్వతంత్ర అభ్యర్థినైనా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌పై మంత్రి కానుమూరు నాగేశ్వరరావు వాఖ్యలు సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో యాదవ ద్రోహులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సర్వసిద్ధి వెంకట రమణ, నక్క సావిత్రి యాదవ్, కోన జయలక్ష్మీ, నక్క సావిత్రి, చిరంజీవి, సర్వసిద్ధి అచ్చుబాబు, పారిపల్లి రాజు, కార్తీక్ పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

స్పందన కార్యక్రమంలో సమర్పించే దరఖాస్తులు, ఫిర్యాదులను మరింత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి జాహ్నవి, డిఆర్ఒ బి.దయానిధి, డిఎల్‌డివో మంజులవాణి, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఏ.హేమంత్, బిజెఆర్ సుజల స్రవంతి ఎస్‌డిసి కె.రమామణి, డిటివో లక్ష్మీ సుహాసిని, సిపివో జి.రామారావు, విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పిఆర్ ఈఈ వీరునాయుడు, డిఎస్ఓ కెవిఎల్‌ఎన్.మూర్తి, డిఇఒ వెంకటలక్ష్మమ్మ సంక్షేమ శాఖ డిడిలు కె.రాజేశ్వరి, అజయ్ బాబు పాల్గొన్నారు.

దళితులు, ఆదివాసీల సమస్యలపై వినతి

అనకాపల్లి మండలం పాపయ్య సంతపాలెం పంచాయతీ పరిధిలో దళితుల 25 ఎకరాల భూమిని జగనన్న కాలనీ నిమిత్తం 2019లో తీసుకొని వారికి ఎల్‌పిసిలు ఇచ్చి నేటికీ భూమి ఎక్కడుందో చూపించలేదని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని డివిఎం సభ్యులు రేబాక మధుబాబుతో కలిసి సోమవారం స్పందనలో బాధితులు జెసికి విన్నవించారు. రోలుగుంట మండలం శరభవరం గ్రామం రాజన్నపేట డ్వాక్రా గ్రూపు సభ్యులకు రెండో విడత ఆసరా నగదు జమ కాలేదని ఫిర్యాదు చేయగా, దానిపై జెసి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్

ప్రజాశక్తి -మధురవాడ: విద్యార్థినిని గర్భవతిని చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఘటన చోటుచేసుకున్న మధురవాడ నారాయణ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువుతున్న అమ్మాయిలపై ఇలాంటి అఘాయిత్యాలు చోటుచేసుకోవడం దుర్మార్గమన్నారు. ఘటన జరిగిన నారాయణ పాఠశాలను మూసేయాలన్న డిమాండ్ సరికాదని, ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మాయిలను ఎవరైనా వేధిస్తే ధైర్యంగా ముందుకొచ్చి చెప్పాలని, ఇలాంటి దుశ్చర్యలతో మానసికంగా కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడడం సరికాదన్నారు. తాను విశాఖ ఎంపినైతే నగరంలో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా అడ్డుకట్ట వేస్తానన్నారు.

విశాఖ కలెక్టరేట్ : బాలికను గర్భవతిని చేసిన నారాయణ స్కూలు పిఇటిని కఠినంగా శిక్షించాలని, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అత్యాచార నిరోధక చట్టం 376కు వచ్చిన సవరణ, సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ననుసరించి పాఠశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రతి విద్యాసంస్థలలో లైంగిక నిరోధక కమిటీలు వేసి, సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పికెఎస్ కార్యదర్శి అన్నపూర్ణ, మహిళా చేతన సభ్యులు ఎ.సత్యవతి, సత్య, కె.లావణ్య పాల్గొన్నారు.

'ప్రతిసారీ రెండు చుక్కలు' పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జెసి జాహ్నవి, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను ప్రతిసారీ వేయించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన మార్చి 3వ తేదీన పోలియో ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రచురించిన 'ప్రతిసారి రెండుచుక్కలు' గోడ పత్రికను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, డిఎల్‌డివో మంజులవాణి, భూసర్వే ఎడి గోపాలరాజా, డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ.హేమంత్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కిషోర్ కుమార్, నర్సీపట్నం వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞావతి పాల్గొన్నారు.

మద్య నిషేధం హామీని అటకెక్కించిన జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి, బుచ్చయ్యపేట : మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని టిడిపి నాయకులు ఆరోపించారు. ఈ మేరకు అనకాపల్లి టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, బుచ్చయ్యపేటలో టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు సోమవారం విలేకర్ల సమావేశాల్లో మాట్లాడారు. మద్యం రేట్లను 3 రెట్లు పెంచారని, ఈ 57 నెలల పాలనలో సుమారు రూ.2 లక్షలు కోట్ల నాసిరకం మద్యం అమ్మి, వాటిద్వారా సమకూరిన లక్ష కోట్లు ఆదాయాన్ని దోచుకున్నారని పేర్కొన్నారు. నాసిరకం మద్యం తాగడంతో దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిన్నాయన్నారు. మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందని ఆరోపించారు.

29 లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలోని అన్ని వ్యాపార సంస్థలు అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం ప్రాంతాల పరిధిలో గల దుకాణాలు, సంస్థలు రిజిస్ట్రేషన్ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని సహాయ కార్మిక కమిషనర్ కె.వసంతరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ వ్యాపార యాజమాన్యం వారి సమీప గ్రామ సచివాలయంలో లేదా మీసేవ కేంద్రంలో ఈనెల 29వ తేదీ లోగా వ్యాపారులు విధిగా కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ లెసెన్స్ తీసుకోవాలని ఆయన సూచించారు.